# దేవుడికి వెలి

"ఈ రోజు మీ స్కూల్లో రఘుని కొట్టేవటగా?"

ప్రశ్న అడిగిన నాన్నగారి ముఖం గంభీరంగా ఉంది. అయినా నేను భయపడలేదు. తప్పు చేసిన వాడైతే భయపడాలి, కానీ నాకెందుకు భయం? అవునన్నట్లుగా తలాడించాను.

"ఎందుక్కొట్టేవ్?" - ఈ సారి ప్రశ్నలో కొంచెం కోపం కూడా చోటు చేసుకుంది.

"వాడు నా పక్కన కూర్చున్నాడు" అన్నాను.

"నీ పక్కన కూర్చోవడంలో తప్పేముంది?" ఈ సారి నాన్నగారి కంఠం కొంచెం ప్రసన్నంగా వినిపించింది.

"తప్పు కాదా మరి. వాడు హరిజనుడు" అన్నాను - మరి వేరే నాన్నగారికి వివరించ నవసరంలేదన్నట్లు.

నాన్నగారు ౖమాన్పడి పోయినట్లు కనపడ్డారు. ఒక్క క్షణం ఆగి నెమ్మదిగా, "హరీ! నువ్వు కూడా హరిజనుడివన్న సంగతి నీకు తెలుసా?" అనడిగారు.

నా తల మీద వెయ్యి పిడుగులొక్కసారి పడ్డట్లయింది. ఆ పట్టణంలోని సద్బ్రాహ్మణులలో ఒక్కరైన రామశర్మగారి ఏకైక పుత్రుడిని నేను. అగ్ని కంటే పవిత్రంగా భావింపబడే శారదమ్మ గారి ఏకైక పుత్రుడిని నేను. నేను హరిజనుడనెలా అవుతాను?

నా సందేహం అర్థమైనట్లుంది. నాన్నగారు నవ్వి, "నువ్వు హరిజనుడివి! నిన్ను నేను చిన్నప్పుడు ఒక హరిజనుడి దగ్గర్నుంచి తెచ్చుకున్నాను" అన్నారు.

నా తల తిరిగిపోతోంది. ఇది నిజమా? నేను అంటరాని వాళ్ళ కులంలో పుట్టానా?

"మాకు ఎప్పటికీ సంతానం కలగలేదు. మరి కలుగుతుందన్న ఆశ నశించాక

ఎవరినైనా పెంచుకోదల్చాను. బంధుజనం మా చుట్టూ ఈగల్లా ముసిరారు. కానీ నా ఆశయం వేరు. సంఘం కొన్ని కులాల వారికి చేస్తున్న అన్యాయం నాకు బాగా తెలుసు. అటువంటి కులంలోంచి ఒకడిని తెచ్చుకుని నా ఆశయాల కనుగుణంగా పెంచి పెద్ద చేయాలనుకున్నాను. నీ తండ్రి ఒక గ్రామంలో మాలపల్లిలో ఉంటున్నాడు. నీ ఊహ కందనంత నికృష్ట జీవనం అనుభవిస్తున్నాడు. నువ్వు పెరిగి పెద్దవాడివై వాళ్ళ జీవితాల నుద్ధరింపగలవని ఆశించాను. కానీ అప్పుడే నీలో సంఘం నాటుతున్న విషబీజాలు మొలకెత్తుతున్నాయి. ఆదిలోనే వాటిని నశింప జేయడం కోసం నిజాన్ని నీకింత తొందరగా చెప్పాను.''

''అయితే నన్ను నా తల్లిదండ్రుల దగ్గరకు పంపించేయండి'' అన్నాను.

''ఇప్పుడు కాదు. ఈ సంవత్సరం నువ్వు స్కూలు ఫైనల్ ప్యాసు కావాలి. తర్వాత రెండు సంవత్సరాలు ఇంటర్మీడియట్, మరో రెండు సంవత్సరాల్లో గ్రాడ్యుయేషనూ పూర్తి కావాలి. అప్పుడు నిన్ను నేను మీ గ్రామానికి పంపిస్తాను.''

''నాన్నగారూ!'' అని నాలిక్కరుచుకుని- ''రామశర్మగారూ!'' అన్నాను.

నాన్నగారు నవ్వి, ''నేనిప్పుడు చెప్పిందంతా మర్చిపో. నువ్వు నా కొడుకువనే అనుకో. నీ జన్మ రహస్యం తెలిసినట్లు నీ తల్లికి కూడా చెప్పకు. సాటి వ్యక్తిని కులాన్నిబట్టికాక గుణగణాల్నిబట్టి గౌరవించడం నేర్చుకో. రక్త సంబంధం లేనంత మాత్రాన నీకు మేము తల్లిదండ్రులం కాకుండా పోము. నువ్వు మా ఏకైక పుత్రుడివి'' అన్నారు.

అప్పట్నించీ నాలో పెద్ద మార్పు వచ్చింది. నా కులం వారిపై సానుభూతి పెరగసాగింది. క్లాసులో నా స్నేహం వారితోనే చేస్తున్నాను. మిగతా విద్యార్థులు వారిపట్ల చూపే నిరసన భావం చూస్తుంటే క్రమంగా నాలో అగ్ర కులాల వారి మీద ద్వేషం పెరిగిపోసాగింది. నాలో రగిలే ఈ ద్వేషం-ఒక పర్యాయం రామావధాని అనబడే సహాధ్యాయిని నేను కొట్టడం వరకూ దారి తీసింది.

ఆ రోజు రాత్రి మళ్ళీ నాన్నగారు కోప్పడ్డారు.

''తప్పు మన వ్యవస్థలో ఉంది. నా విశాల భావాలు తెలిసుండీ ఒకప్పుడు నువ్వూ హరిజనుల్ని అంటరాని వారుగా భావించావు. ఆ కారణంగా వారిని ద్వేషించావు. అలా ద్వేషించమని నీ కెవరుచెప్పారు? నువ్వు హరిజనుడివని తెలిశాక నీ ద్వేషం అగ్ర కులాల మీదకు మళ్ళింది. మన వ్యవస్థను మార్చాలి తప్పితే వ్యక్తి ద్వేషాలకు మనసులో తావివ్వకూడదు. రాజ్య కాంక్షతో ఒక దేశపు రాజు మరో దేశపు రాజు మీద దండెత్తవచ్చు. కానీ ఆ రెండు దేశాల ప్రజలూ కూడా దీనికి సంబంధించి అమాయకులే! నీ వనుకుంటున్నట్లు అగ్రకులాల వారందరూ దుర్మార్గులు కారు. కానీ ఒక వ్యవస్థకు అలవాటుపడి అలా ప్రవర్తిస్తున్నారు. వారంతా సామాన్యులు. రెండు శత్రు దేశాల ప్రజలు ఒకరినొకరు అసహ్యించుకోడానికి కారణం కేవలం వాళ్ళ ప్రభువులు. ఈ విషయంలోనూ అంతే !''

నా బుర్ర మరి కాస్త పదునెక్కింది. నా హృదయం మరికాస్త విశాలమయింది. నేను నాన్నగారిని ఆదర్శంగా తీసుకున్నాను. ఆయన సద్బ్రాహ్మణులు. బ్రాహ్మణ విధులన్నీ

సక్రమంగా పాటిస్తారు. అయితే ఆయన హరిజనుణ్ణి తాకితే స్నానం చేయరు. భోజనం చేయడానికాయనకు పంక్తి పట్టింపులు లేవు. అసలు నన్నాయన పెంచుకోవడమే ఒక పెద్ద విశేషం!

నాన్నగారిలో మరో పెద్ద విశేషం--ఆయన ఎన్నడూ దైవదర్శనం చేసుకోడానికి గుడికి వెళ్ళలేదు. అమ్మ వెడుతూండేది కానీ నన్ను కూడా ఆయన ఆమెతో వెళ్ళనిచ్చేవారు కాదు. మొదట్లో ఆయన ప్రవర్తనకు అర్థం తెలియకపోయినా నా జన్మరహస్యం తెలిసేక ఆయన మీద నాకనుమానం కలిగింది. నేను హరిజనుణ్ణి కాబట్టి ఆలయ ప్రవేశానికి అనర్హుణ్ణి. నాకా అర్హత కలక్కుండా ఉండడం కోసమే ఆయన కూడా దైవదర్శనం మానుకుంటున్నారు.

నా సందేహం విన్నాక నాన్నగారికి నవ్వు వచ్చింది. "వెర్రివాడా! దేవుణ్ణి చూడడానికి గుడికెందుకు వెళ్ళడం? సృష్టిలో ఆయన లేని దెక్కడ? ప్రపంచమంతటా అవరించుకుని ఉన్న ఆ భగవంతుణ్ణే నే నారాధిస్తున్నాను. గుడిలో దేవుణ్ణి నేను చూడకపోవడానికి కారణం ఆయనకు సమదృష్టి లేదు. మనుషులందరికీ ఆయన్ను దర్శించుకునే అర్హత లభించేవరకూ నే నాయన్ను చూడదల్చుకోలేదు" అన్నారాయన.

"ఇప్పుడా అర్హత ప్రభుత్వం ఈయవచ్చుగా?" అన్నాను.

"ఇచ్చి ప్రయోజన మేముంది. ఆచరణలో లేకపోయాక? మన వ్యవస్థలోని ముఖ్య లోపమిక్కడే ఉంది. దేవాలయంలో మనుషులంతా ఒకటిగా ఒక పంక్తిలో కూర్చోగలిగిన నాడు-బయట సంఘంలో మార్పు రావడానికెంతో కాలం పట్టదు. ఈ విషయంలో నువ్వు కృషి చేయాల్సుంటుంది" అన్నారు నాన్నగారు.

అప్పటి కాయన ఉన్నతాశయం అర్థమైంది. నా ఆలోచనా శక్తి మరికాస్త పెరిగింది.

నాన్నగారు మళ్ళీ అన్నారు-- "బట్టలుతికే చాకలి ముట్టుకుంటే మైల బట్టలు శుద్ధి అవుతాయని నమ్మేవారు, దేవుడి కామాత్రపు శక్తి కూడా ఉందని నమ్మడం లేదు. అందుకే కొంతమంది ప్రవేశాన్ని వారు విషేధించారు."

మనిషి ఆలోచన లెంత సంకుచితమైనవో అర్థమైంది. ఎవడో ఒకడు తనకు తోచిన కొన్ని విషయాల్ని సిద్ధాంతాలుగా చేస్తే- వాటిని గుడ్డిగా అనుసరిస్తున్నారు మిగతా అందరూ. ఆలోచనలకు గురి చేయకుండా ఈ సిద్ధాంతాలను పాటించే వారందరూ వ్యక్తిత్వం లేనివారే! ఎటొచ్చీ ఈ వ్యక్తిత్వం లేనివారిలో కొంత మంది అగ్రకులాలకు చెందడం ద్వారా ఏమీ నష్టానికి గురి కాలేదు. కొంతమంది అంటరాని వారనిపించుకుని అవమానాల పాలవుతున్నారు.

నేను క్రమంగా చదువుతూ గ్రాడ్యుయేట్‌ని కాగలిగాను. అప్పుడే నాన్నగారు చెప్పారు. నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల గురించి, నా తండ్రి పేరు చెంచన్న. తల్లి నాగమ్మ. మా వూరు శివపురం గ్రామం. ఆ గ్రామ జనాభా రెండు వేలు. అన్ని కులాలవారూ ఉన్నారు. ఊరికి కాస్త దూరంగా మాలపల్లి ఉంది. అక్కడున్న గుడిసెలో నా తల్లిదండ్రుల మకాం. చెప్పులుకుట్టీ పొలం పనులు చేసీ, బ్రతుకు దుర్భరంగా సాగిస్తున్నారు నా తల్లిదండ్రులు.

నాన్నగారు నాకిలా చెప్పారు - ''ఉద్యోగం చేయవలసిన అవసరం నీకు లేదు. కేవలం విజ్ఞాన సముపార్జన చేయడం కోసమే నిన్ను చదివించాను. నీవంటి సావకాశం ఎంతోమంది యువకులకు లభించదు. వెళ్ళు, నీ గ్రామానికి వెళ్ళి నీ తల్లిదండ్రులనూ, బంధువులనూ కలుసుకో. వారి జీవితాన్ని గమనించు. వారినెలా ఉద్ధరించాలో ఆలోచించి చూడు. మహాత్ముడు వారిని హరిజనులని పిలిచి గౌరవించాడు. పిలుపు నిలబడినా గౌరవం వారికి లభించలేదు. వారిలోంచి నాయకులు పుడుతున్నారు. కానీ వారింకా ఊరికి పొలిమేరలోనే ఉంటున్నారు. ఇందుకు కారణమేమిటీ, లోపమెక్కడున్నదీ అన్న విషయం తెల్సుకోవడానికి ప్రయత్నించు. ఇది నీకు సంబంధించిన బాధ్యత. నీ వారికి సంబంధించిన సమస్య. నీ మీద నాకు చాలా ఆశలున్నాయి. నీ ఆశయసిద్ధికి అన్ని విధాలా నా నుంచి సహకారం లభిస్తుంది.''

ఆయన మాటలు నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఆయనలో ఎంత తపన ఉంది?

అనుకున్న ప్రకారం నేను శివపురం చేరుకున్నాను. నాన్నగారి స్నేహితులయిన కృష్ణ సోమయాజిగార్ని కలుసుకుని నన్ను నేను పరిచయం చేసుకున్నాను. ఆయన నన్ను చాలా అభిమానించి ఆదరించాడు. అందుకాయనలో స్వార్థంతో కూడిన ఆలోచన లేకపోలేదు. ఆయన కూతురు సులోచనను నాకిచ్చి వివాహం చేయాలనే ఉద్దేశ్యంలో ఉన్నాడు. ఈ విషయంలో నాన్నగారి అభిప్రాయమింకా తెలియదు గానీ కృష్ణ సోమయాజిగారి అభిప్రాయం మారడానికి ఒకటి రెండు రోజులు చాలునని నాకు తెలుసును. నిజానికి ఒకటి రెండు రోజులు కూడా అవసరం లేదు. కొన్ని క్షణాలు చాలును. కానీ సులోచన సౌందర్యం నన్ను కర్తవ్యతా విమూఢుణ్ణి చేసింది. నా జన్మ రహస్యాన్ని బయటపెట్టి ఆమె దృష్టిలో ఒక అంటరానివాడుగా నిలబడడానికి నా మనసంగీకరించలేదు. దాన్ని అదుపులోకి తీసుకురావడానికి రెండ్రోజులు పట్టింది.

నేను చెంచన్నను కలుసుకోవాలని చెప్పినప్పుడు, సోమయాజిగారి ముఖంలో ఆశ్చర్యం కన్పించింది. చెంచన్న ఎవరో ముందుగా ఆయనకు తెలియలేదు. నేనడిగిన చెంచన్న మాలపల్లికి చెందిన వాడైయుండాలని ఆయనకు తోచలేదు. మాలపల్లికి చెందినవాడని నేను చెప్పేక నేనతన్ని కలుసుకోవలసిన అవసరమేమిటో ఆయన కర్థం కాలేదు. అప్పుడు నేను నెమ్మదిగా వచ్చిన పని, నా జన్మ రహస్యం చెప్పాను.

కృష్ణసోమయాజిగారు షాక్ తినేశాడు. ఆయన నోట మాట లేకుండా కాసేపు గుడ్లప్పగించి నావంకే చూస్తూండి పోయాడు. తేరుకున్నాక ఆయనకు కోపం వచ్చింది. తన వంశ మర్యాద గురించి ఏకరువు పెట్టాడు. రామశర్మ ఇలా తన కులాన్ని మంటపెడతాడని తనూహించలేదన్నాడు.

ఆచారం కోసం నిప్పులు కూడా కడుక్కునే సోమయాజిగారింట ఒక అంటరానివాడు విచ్చలవిడిగా తిరిగాడు. సహపంక్తి భోజనాలు చేశాడు. మరి ఆయన మనసు పాడుకావడంలో

ఆశ్చర్యమేముంది?

నేనాయన్ను సూటిగా కొన్ని ప్రశ్నలు వేశాను. నేను అంటరాని వాణ్ణి ఎలాగయ్యాను? ఏ కారణంగా అయ్యాను? నన్ను చూస్తే ఏమీ తెలియడంలేదు. నేను రామశర్మ కొడుకునని చెబితే నమ్మగలుగుతున్నారు. నేను నా జన్మ రహస్యాన్ని చెప్పేవరకూ నేనంటరానివాణ్ణని ఎవరూ గ్రహించడంలేదు. మరి తెలియగానే అంటరానివాణ్ణి కావడానికి కారణమేమిటి?

"జన్మ ఒక్కటి చాలు!" అన్నాడు కృష్ణసోమయాజి.

"మీకు గాంధీ మహాత్ముడు తెలుసా?" అనడిగాను.

"తెలుసును" అన్నాడాయన.

"ఆయన్ను మీరు గౌరవిస్తారా? మహాత్ముడని అంగీకరిస్తారా?" అన్నాను.

ఆయన గౌరవిస్తానన్నట్లు తలూపాడు.

"మనిషిని మనిషి అంటరానివాడుగా భావించడాన్నాయన ఆమోదించాడా?" అనడిగాను.

"ఆయన గొప్పవాడు. ఏం చేసినా చెల్లుతుంది. గౌరవించబడతాడు. నా బోటి సామాన్యుడు సంఘంలో గౌరవంగా బ్రతకాలంటే కొన్ని ఆచారాలు పాటించి తీరవలసిందే! నా మీద దయుంచి నీ జన్మ వృత్తాంతాన్ని మరింకెవ్వరికీ చెప్పక. ఇక్కణ్నుంచి వెళ్ళిపో. నేనూ జరిగింది మర్చిపోవడానికి ప్రయత్నిస్తాను" అన్నాడు కృష్ణసోమయాజి.

అర్థమయిపోయింది నాకు. కృష్ణసోమయాజి అంతటి నిష్ఠాగరిష్ఠుడు కూడా నన్ను తాకడాన్ని తప్పుగా భావించడంలేదు. ఆ విషయం నలుగురికీ తెలియకూడదన్నదే ఆయన కోరిక. నాన్నగారు చెప్పినట్లు ఆయనపై వ్యవస్థ ప్రభావముంది. వ్యక్తిగతంగా ఆయన ఈ విషయంలో అనుకున్నంత దుర్మార్గుడు కాడు.

ఈ ఆలోచన నాకు చాలా బలాన్నిచ్చింది. అందుకే సోమయాజిగారి మాటలను కాలదన్ని నా జన్మ వృత్తాంతాన్ని బహిరంగం చేసి మాలపల్లికి వెళ్ళాను. నా తల్లితండ్రులైన చెంచన్న, నాగమ్మలను కలుసుకున్నాను.

వాళ్ళుండేది పూరి గుడిసెలో. తినేది గొడ్డు మాంసం. తాగేది మద్యం. పరిశుభ్రత వారికి దూరం. సంస్కారం వారిలో పూజ్యం. వారి జీవితం నిస్సందేహంగా హేయం. వారి మధ్య జీవించడం నాకు నిజంగా చాలా కష్టమనిపించింది. ఈ అలవాట్ల కారణంగా వారంటరాని వారయ్యేరా లేక అంటరానివారు కావడమే వారినిలా చేసిందా?

వీరి కోసం కాలేజీల్లో సీట్లను కేటాయిస్తున్నారు. ఉద్యోగాలలో వాటా అట్టేపెడుతున్నారు. ఈ స్థితిలో ఉన్న వీరు వాటినే విధంగా ఉపయోగించుకోగలరు?

వారి ఈ స్థితిని మార్చడానికి తీవ్ర ప్రయత్నాలెవరైనా చేస్తున్నారా? హరిజనులకు రిజర్వేషన్ పెంచాలనే వారూ, దేశంలో అవినీతి లంచగొండితనం సమస్యలను నిర్మూలించడానికి పెద్ద ఎత్తున తిరుగుబాట్లు చేసేవారూ, ప్రత్యేక రాష్ట్రాలు కావాలంటూ సాటి సోదరుణ్ణి అమానుషంగా హింసించేవారూ, ప్రజాక్షేమం కోరుతూ లెక్చర్లిచ్చేవారూ, నాయకులూ,

సంఘ సంస్కర్తలూ-వీరిలో ఏ ఒక్కరయినా ఈ దౌర్భాగ్యుల జీవితాల్ని మార్చడానికి త్రికరణశుద్ధిగా ప్రయత్నిస్తున్నారా?

ఎన్నికలు వస్తున్నాయి. ఓట్లు కావాలనుకునే వారు వీరి బలహీనతలను ప్రోత్సహించి, కావలసినంత మద్యం సరఫరాచేసి, రంగుల కలలను ప్రసాదించి ఏలికలవుతున్నారు. తర్వాత వారేం చేస్తున్నారు?

నక్క కొంగకు మూకుడులోనూ, కొంగ నక్కకు సన్న మూతి కూజాలోనూ పాయసం వడ్డించిన విధంగా, వీరి సదుపాయం కోసం కొత్త కొత్త చట్టాలు చేస్తున్నారు. అవి వారికెంతవరకు ఉపయోగపడుతున్నాయో చెప్పడానికి శివపురం గ్రామంలో ఇంకా మాలపల్లి ఉండడమూ, అందులోని ప్రజల జీవితమూ చాలు.

మాలపల్లిలో సుమారు పాతిక గుడిసెలున్నాయి. వందకు పైగా మనుషులున్నారు. చిన్న పిల్లలకు సరైన వైద్య సదుపాయం లేదని బాధ తప్పితే వారు, ఆరోగ్యంగానే ఉన్నారు. నిజం చెప్పాలంటే నా కంటే బలంగా, దృఢంగా ఉన్నారు. కష్టపడి పని చేస్తారు. చీకూ చింతలు లేవు. ఆరోగ్యాని కింతకంటే అవసరమేముంది?

ఆదోగ్యంగా బ్రతకడమొక్కటే మనిషి జీవిత ధ్యేయం గాదు. మనిషి మనిషిగా బ్రతకాలి గదా! అందువల్లనే నాకు జన్మనిచ్చిన వారైనప్పటికీ తొలిసారి నా తల్లిదండ్రులను కలుసు కున్నప్పుడు ఏ మధురాను భూతులకూ గురికాలేక పోయాను, జుగుప్సాకరంగా వున్నప్పటికీ నేను నా తల్లిదండ్రుల గుడిసెలో మకాం పెట్టాను. పెరుగు అన్నం, పళ్ళూ, పాలూ నా ఆహారం చేసుకున్నాను. చెంచన్న చాలా గర్వంగా నన్ను తన కొడుకుగా గూడెంలో పరిచయం చేశాడు. చెంచన్నకు నావంటి కొడుకుండడం వారందరికీ ఆశ్చర్యంగా వుండే. నా కింకా ఇద్దరు తమ్ముళ్ళు, ఒక చెల్లెలూ ఉన్నారు. వాళ్ళంటరాని వాళ్ళలా కనిపిస్తారు. అదే మాకు తేడా!

నేను నా కార్యక్రమాన్ని ప్రారంభించాను. రోజూ ఓపిగ్గా వాళ్ళకెన్నో విషయాలు బోధించగలిగాను. చదువు ఆవశ్యకతను వివరించసాగాను. నా మాటలు నచ్చినా నచ్చకపోయినా గూడెంలో ప్రతి ఒక్కరూ నన్ను ప్రేమించసాగారు.

వాళ్ళ అభిమానానికి పాత్రుడినయ్యానని గ్రహించేక ఒక రోజు చెప్పాను - "మీరూ నలుగురితోపాటు కలిసి మామూలుగా తిరగాలంటే ముందు దేవుడితో ప్రారంభించాలి. ఊళ్ళో గుడి ఉంది కదా. మీరందులోకి ఎందుకు పోరు?"

చాలా మంది ఆ విషయం గురించి ఆలోచించినట్లేలేదు. ఆలోచించేక కొంతమంది భయాన్ని వ్యక్తపరిచారు. మరికొంతమంది పాపమన్నారు.

నాకు వేదాల గురించి ఎక్కువగా తెలియకపోయినా, అంటరానితనం వేదాల్లో లేదని తెలుసు. అదే వారికి చెప్పాను. పురాణాలగాథలు కొన్ని చెప్పి, అందులో పాపమేమీలేదనీ, కొంతమంది స్వార్థపరుల కారణంగా ఈ సూత్రాలమల్లోకి వచ్చాయనీ వాళ్ళకు వివరించాను. నా తెలివితేటల మీద, విజ్ఞానం మీదగల అపారమైన నమ్మకంతో వారంతా చివరకు

అంగీకరించారు.

ఒకరోజు నేను వాడలోని జనాన్ని వెంట పెట్టుకుని ఊళ్ళోని గుడి దగ్గరకు బయల్దేరాను. ఎలా తెలిసిందో ఈ వార్త ఊరి పెద్దలకు తెలిసిపోయింది. వారు కంగారుగా నన్ను చూడవచ్చారు. దేవాలయం పవిత్రమైనదనీ, ఆ పవిత్రతను పాడుచేయవద్దనీ వారు విన్నపాలు చేశారు. నేను వినలేదు. దీనంగా బ్రతిమాలుతున్నారు వాళ్ళు.

బ్రతిమాలక ఏం చేస్తారు? ఇతరులను బెదిరించడానికి వాళ్ళుపయోగించుకునే రౌడీలు మాలపల్లికి చెందినవారే! వారంతా ఇప్పుడు నా క్రింద ఉన్నవారే!

నేను, నా వెనుక హరిజనులు-ఒక ప్రవాహంలా గుడి దగ్గరకు సాగిపోతున్నాం.

శివపురంలో రెండాలయాలున్నాయి. గ్రామదేవత గుడి మినహాయించగా ఒకటి శివాలయం, రెండవది విష్ణ్వాలయం. విష్ణ్వాలయం ఒక చిన్న కొండ మీద ఉంది. సుమారు వంద మెట్లు ఎక్కాలి. పైకి వెళ్ళడానికి మేమిప్పుడు నడుచుకుంటూ ఆ కొండ దిగువకు వచ్చాము.

ఆలయానికి సంబంధించిన అర్చకులు మెట్లకు అడ్డంగా పడుకున్నారు. "ఆలయ ప్రవేశం చేయాలనుకుంటే మమ్మల్ని తొక్కుకుంటూ వెళ్ళండి" అన్నాడు వాళ్ళలో ఒకడు. నా వెనుక నున్న ఒకడు- "పదండిరా!" అన్నాడు. నేను వారించాను.

"దౌర్జన్యంతో ఆలయప్రవేశం చేయడానికి రాలేదు నేను. మన జాతిపిత గాంధీ మహాత్ముడి ఆశయం నెరవేరాలంటే మీరు మమ్మల్ని ప్రేమగా ఆలయంలోకి ఆహ్వానించాలి. అందుకు నే నాయన పద్ధతినే అనుసరించదలిచాను. "మీ అంతట మీరు ఆహ్వానించేదాకా మేమూ ఆలయ ప్రవేశం చేయం. అంతవరకూ ఈ కొండ మెట్ల దగ్గర నేను నిరాహార దీక్ష కొనసాగిస్తాను" అన్నాను.

నా సంకల్ప బలాన్నక్కడివారు తక్కువ అంచనా వేశారు. వరుసగా మూడు రోజులు నా నిరాహారదీక్ష కొనసాగేసరికి ఈ వార్త శివపురంలోనే కాక చుట్టు పక్కల గ్రామాల్లో కూడా సంచలనం కలిగించింది. శివపురంలో పోలీస్‌స్టేషన్ లేదు. కానీ దగ్గర్లో ఉన్న ఊర్నించి పోలీస్ బలగం వచ్చిందొక రోజున. ముందు ఇన్‌స్పెక్టర్ నాకు నచ్చ చెప్పడానికి ప్రయత్నించాడు. అనవసర రక్తపాతానికి దారి తీసే ఇటువంటి గొడవలు మంచిది కాదన్నట్లు చెప్పాడాయన.

'బాధ్యతగల ప్రభుత్వోద్యోగిగా మీరు నాకు నచ్చజెప్పడం బాగోలేదు. చట్టం ప్రకారం ఆలయంలోకి ప్రవేశించే అర్హత మాకున్నది. ఆ చట్టాన్ని సంరక్షించే మీరు-ఎంత శ్రద్ధగా బాధ్యత నిర్వహిస్తున్నారో నేను నిరాహార దీక్షకు పూనుకోవలసిన అవసరమే తెలియజెబుతోంది' అన్నాను.

ఇది చిన్న సమస్య కాదు. రెండు విభిన్న వర్గాలకు చెందిన బృహత్సమస్య. ఇన్‌స్పెక్టర్ ఏమీ చేయలేక, "మీరాలయప్రవేశం చేయవచ్చు. కానీ వారు ప్రేమతో మిమ్మల్నాహ్వానించాలంటే నేనేం చేయగలను?" అని కొంత పోలీసు బలగాన్నక్కడ కాపలా పెట్టి వెళ్ళిపోయాడు.

మూడు రోజులుగా ఆహారం తీసుకోక పోయినా నేను నీరసంగా ఫీలవడం లేదు. నాకు తెలియని అజ్ఞాతశక్తి నాకు బలాన్నిస్తోంది. త్రాగే మంచి నీరే కావాల్సిన బలాన్ని ప్రసాదిస్తోందేమో మరి నాకు తెలియదు.

ఏడెనిమిది రోజుల పాటు నా నిరాహారదీక్ష కొనసాగేసరికి వార్త పాలకుల వరకూ వెళ్ళింది. నిరాహారదీక్షకు కారణమేమిటో తెలుసా? అంటూ ఎన్నో పత్రికలలో కార్టూన్లు, విశేషాలూ వచ్చాయి. ఉన్నట్లుండి నేను నిరాహారదీక్ష కొనసాగించి తొమ్మిది రోజులు జరిగేక ఒక మంత్రి వర్యుడు గ్రామం విచ్చేశాడు. ఆయన వస్తున్నారని తెలిసి గ్రామంలో పెద్ద ఎత్తున ఆహ్వానించడానికి ఏర్పాట్లు జరిగాయి.

ఆయన వచ్చి సభ చేసి అంటరానితన్నాన్ని నిర్మూలించవలసిన అవసరం గురించి ఒక గంట సేపు ఉపన్యాసమిచ్చేడు. గాంధీ మహాత్ముడు వెలసిన ఈ భూమిలో మనిషికీ మనిషికీ మధ్య ఇంకా ఈ అంతరాలు కొనసాగుతున్నందుకు ఆయినకు కలిగిన విచారానికి ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కంఠం పూడుకుపోయి కాసేపు మాటలు రాలేదు.

హిందువుడైన ప్రతివాడికీ ఈ ఆలయంలో ప్రవేశించడానికి అర్హత ఉన్నదనీ, అభ్యంతరం చెప్పిన వారు కఠినంగా శిక్షించబడతారనీ ఒక బోర్డు వ్రాయించి మెట్ల క్రింద ఏర్పాటు చేశారు. అనంతరం మంత్రివర్యుడు ఆప్యాయంగా నన్ను కౌగిలించుకున్నాడు. ఆయన చేతితో ఇచ్చిన ఫలరసం తాగాను. అంతా చప్పట్లు కొట్టారు. ఎన్నో కెమెరాలు క్లిక్ మన్నాయి.

మినిస్టరుగారు ముందు దారి తీయగా-నేనూ, నా వెనుక నా హరిజనులూ బయల్దేరాం. నాకు చాలా ఉద్రేకంగా ఉంది. ఆ ఉద్రేకంలో నీరసం తెలియడం లేదు. అయినా ఇద్దరు మనుషులు నాకు ఆసరాగా ఉన్నారు. మెట్లన్నీ పూర్తిగా ఎక్కేక అర్చకులు అక్కడ కనిపించారు. వాళ్ళు మమ్మల్ని ప్రేమగా ఆహ్వానించారు. నా వెనుకనున్న జనం ప్రవాహంలా ముందుకు కదిలారు. ఎన్నో సంవత్సరాలుగా తమను వెలివేసిన ఆ దేవుణ్ణి చూసే అర్హత సంపాదించుకున్నామన్న ఆనందంతో వారుత్సాహంగా ముందడుగు వేస్తున్నారు. మినిష్టరుగారంటున్నారు-త్వరలోనే అన్ని ఆలయాల్లోనూ హరిజనులను అర్చకులుగా నియమించే కార్యక్రమం ప్రారంభించనున్నామని.

నేను ఆవేశంతో నా ప్రజలనుద్దేశించి- "ఆగండి!" అని అరిచాను.

అంతా ఆగిపోయి నా వంక కుతూహలంగా చూస్తున్నారు.

"మీరు ఆలయంలో ప్రవేశించడానికి వీల్లేదు. ఇది నా ఆజ్ఞ! నా మీద గౌరవమున్న వారెవరూ ఈ గుడి లోపల అడుగు పెట్టవద్దు."

నా ఉద్దేశ్యమేమిటో అర్థంకాక మా వాళ్ళందరూ తెల్లబోయారు. చెంచన్న నా వైపుగా వస్తున్నాడు. ఆయన కళ్ళలో కోపముంది. "దేవుణ్ణి సూట్టానికి కాకుంటే-ఇంత కట్టమెందుకు పడ్డట్టు?" అన్నాడాయన.

నేను నవ్వాను. నా నవ్వు అదోలా ఉంది. "వీడు-ఈ ఆలయంలో ఉన్నవాడు దేవుడా? సాటి మనుషుల్లో కొంత మంది మిమ్మల్ని విడదీసి వేరే అట్టేపెట్టి-'మీరు అంటరానివారు,

మీరు ఈ గుడిలోనికి రావడానికి వీల్లేదు' అంటే చూస్తూ ఊరుకున్న వీడు దేవుడా? వీణ్ణి చూడ్డానికి మీరు తహతహ లాడిపోతున్నారా? ఈ గుడిలో ఉన్నవాడే దేవుడైతే-ఎవరికి ఎలా ఉపయోగపడ్డాడు? తన్ను నిత్యమూ పూజించే ఈ అగ్రకులాల వారి అభీష్టాన్ని కాదని మనం ఆలయ ప్రవేశం చేస్తూంటే వారికి వీడేవిధంగా సహాయపడగలిగాడు? వీడు దేవుడుకాదు--- మనుషులు చేసిన బొమ్మ. వీణ్ణి మనం చూడం. ఇంతకాలం ఈ దేవుడు మనల్ని వెలివేశాడు. ఈ రోజు నుంచి మనం ఈ దేవుణ్ణి వెలివేద్దాం. ఆ వెలివేసే అర్హత సంపాదించటం కోసమే నేను నా ప్రయత్నాలు మొదలుపెట్టాను. అనుమతి ఇవ్వగానే తగుదునమ్మా అంటూ గుళ్ళో దూరి-పూజ చేయాలనుకునే బానిస మనస్తత్వానికి స్వస్తి చెప్పడానికి నాంది--ఈ రోజు మనం దేవుడికి వేస్తున్న వెలి'' అన్నాను.

నా మాటలు నా ప్రజలకెంతవరకూ అర్థమయ్యేయో తెలియదుకానీ, వారు శీఘ్రంగా మెట్లు దిగనారంభించారు. నేను మంత్రివర్యుని వంక మిగతా ప్రజలవంకాచూసి, "అయ్యా! మీ దేవుడి చేతకానితనం ఋజువయింది కదా! మమ్మల్నాయన ఆపలేకపోయాడు. అయినా మీరు మరోలా తృప్తిపడవచ్చు. తన మహిమతో ఆయన నాకీ ఉద్దేశ్యాన్ని పుట్టించాడని. ఆ విధంగా ఆయన మహిమను మీరు మరికాస్త పెంచవచ్చు. కానీ మాకు మాత్రం ఒకటే తృప్తి-అగ్రకులాలకు చెందిన మీరు నిత్యమూ పూజిస్తూండే ఒక దేవుణ్ణి కడజాతి వాళ్ళమైన మేము వెలివేశాం. సాక్ష్యంగా మెట్ల క్రింద ఈ రోజు పెట్టబడిన బోర్డు ఉంటుంది'' అన్నాను.

"శభాష్! "అంటూ మెచ్చుకున్నారు నాన్నగారు జరిగింది విని.

"చాలా తెలివైనవాడివయ్యావు. చెంచన్న నాకు బాగా సహకరించినప్పటకీకూడా ఈ పాటికి నీ జన్మ రహస్యం తెలుసుకున్నావనుకుంటాను'' అన్నారు నాన్నగారు.

"అంటే?'' అన్నాను అర్థంకాక.

"నీ తండ్రి చెంచన్న కాడు. నా కోరిక మన్నించి అతనలా నటించాడు. నీ తండ్రిని నేనే! నాలోని కొన్ని ఆశయాల్ని కొన్ని బలహీనతల కారణంగా అమలు జరుపలేకపోయాను. నీ రూపేణా నెరవేర్చుకోవాలనుకున్నాను. అయితే నీలో జాత్యహంకారం రేగుతోందని చిన్నతనంలోనే గ్రహించి, నీ జన్మ రహస్యమంటూ ఒక చిన్న అబద్ధం చెప్పాను. ఆ విధంగా నీలోని బ్రాహ్మణుడిని నువ్వు వెలివేశావు. బ్రాహ్మణుడనగా దైవస్వరూపుడని పురాణాలు చెబుతున్నాయి. అనగా దేవుడికి వెలి నీ మనసులోనే ప్రారంభమైంది. ఇప్పుడు నువ్వు బ్రాహ్మణుడివి కాదు, హరిజనుడివి కాదు-మనసున్న ఒక మనిషివి'' అన్నారాయన.

నాకు చాలా సంతోషం కలిగింది. అందుక్కారణం-నేను హరిజనుణ్ణి కాదని తెలియడమూ కాదు, అగ్రకులం వాడిననీ కాదు- రామశర్మ వంటి ఉదాత్త మానవుడు నిజంగానే నాకు తండ్రి అన్న విషయం నిజంగా నిజం కావడం! ★

*(విజయ మాస పత్రిక అక్టోబర్ 1980)*